క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: విజయవాడ–అవనిగడ్డ కరకట్ట రోడ్డుపై జరిగిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటనపై పెనమలూరు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. విజయవాడ కృష్ణలంకకు చెందిన జంపాన రాజ్‌కుమార్, అతని మిత్రుడు బాలచంద్ర కరకట్ట రోడ్డులో బైక్ పై వెళ్తుండగా పెదపులిపాక గ్రామం వద్ద ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజ్‌కుమార్, బాలచంద్ర గాయపడ్డారు. వారిని విజయవాడలో ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెనమలూరు: మండలంలోని చోడవరం గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని సర్పంచి కాకర్ల వెంకటరత్నం మంగళవారం తెలిపారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొంటారని పేర్కొన్నారు. గ్రామస్తులు తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందాలని సూచించారు.

పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ

ఉంగుటూరు: అర్హులందరికీ సంక్షేమం అందజేయాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎంపీడీఓ జీవీస్వీ శేషగిరిరావు అన్నారు. మండలంలో పలు గ్రామాల్లో పింఛను పెంపు వారోత్సవాలు నిర్వహించారు. వెల్దిపాడు సచివాలయం వద్ద కొత్త పింఛనుదారులకు ఎంపీడీవో మంజూరు పత్రాలు అందజేశారు. సర్పంచ్ లాం నాగేశ్వరరావు, నాగవరప్పాడు వైఎస్సార్ సీపీ కన్వీనర్ సీమయ్య పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత

గన్నవరం రూరల్: సచివాలయం ఉద్యోగుల సేవలకు సర్వత్రా ప్రశంసలు లభిస్తున్నాయి. మండలంలోని ముస్తాబాద సచివాలయం–1లో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న జెట్టి నానారావు మంగళవారం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి లబ్ధిదారుకు పెన్షన్ అందజేశారు. గ్రామానికి చెందిన రాయన పాటి జగన్నాథాచారి పక్షవాతానికి గురై విజయవాడలో చికిత్స పొందుతున్నారు. గ్రామస్తులు, బంధువులు విషయం నానారావుకు తెలిపారు. స్పందించిన ఆయన ఆస్పత్రిలో అందజేశారు. నానారావు సేవలను పంచాయతీ కార్యదర్శి కె.లక్ష్మీ, సహచర సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు అభినందించారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



ఉయ్యూరు: సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి అని సినీనటుడు ప్రభాస్ శ్రీను అన్నారు. కలవపాములలోని శ్రీ జ్యోతి పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రభాస్ శ్రీను మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. సంబరాల్లో భాగంగా గంగిరెద్దుల విన్యాసాలు, బండ లాగుడు, కోడి, గొర్రె పొట్టేళ్ల పందేలు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కాలేజీ డైరెక్టర్ సూరపనేని వెంకటరమణ, ప్రిన్సిపాల్ వంశీ పర్యవేక్షించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు సమీపంలోని అనాధికార డంపింగ్ యార్డును తొలగించాలని, గ్రామంలో పారిశుద్ధ్యం, వీధిలైట్లు, తాగునీటి సరఫరా మెరుగుపర్చాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచి నిడమర్తి సౌజన్య అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. గన్నవరం–ఆగిరిపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన చెత్త కుప్పలు పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతుందని గ్రామస్తులు తెలిపారు. చెత్తను గొల్లనపల్లి సమీపంలో తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఈవో బాపూజీ తెలిపారు. డ్రైయిన్లలో పూడికలు తొలగించాలని, సుందరయ్య పార్కులో మౌలిక సదుపాయల కల్పనకు చర్యలు తీసుకోవాలని, జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణం అభివృద్ధికి జిల్లా పరిషత్ దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేశారు. వీధిలైట్లు మరమ్మతులు చేయించాలని కోరారు. జూనియర్ అసిస్టెంట్లు ప్రసాద్, రత్నాకర్‌రావు పాల్గొన్నారు.

కరోనా నిరోధంపై విస్తృత అవగాహన అవసరం



గన్నవరం రూరల్: కరోనా నిరోధంపై వైద్య విద్యార్థులకు విస్తృత అవగాహన అవసరమని యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో (అమెరికా) అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణ మల్లెల పేర్కొన్నారు. మంగళవారం గన్నవరం మండలం చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు పర్యవేక్షణలో కరోనా నివారణ చికిత్సా విధానాలు, అభివృద్ధి అనే అంశంపై డాక్టర్ కృష్ణ మల్లెల వైద్య విద్యార్థులు, పీజీలను, డాక్టర్లను ఉద్దేశించి మాట్లాడారు. కరోనా వైరస్ అనేది స్పైక్ ప్రొటీన్‌గా వివరించారు. స్వీయ జాగ్రత్తలు పాటించాలన్నారు. మాస్క్ ధరించటం, శానిటైజర్ వాడటం తప్పని సరి అని చెప్పారు. కరోనా వైరస్ మ్యూటేషన్లు ఎక్కువగా ఉన్నాయని, విద్యార్థులు అవగాహన చేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మూర్తి, డెప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కళ్యాణి, డాక్టర్ ఈశ్వర్, హెచ్‌ఓడీలు, వైద్యులు పాల్గొన్నారు.

పింఛన్ల తొలగింపు చంద్రబాబు మాయే

- పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి
- ఉయ్యూరులో కొత్త పింఛన్ల పంపిణీ

ఉయ్యూరు: పింఛన్ల తొలగింపు చంద్రబాబు, ఎల్లో మీడియా మాయేనని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి విమర్శించారు. ఉయ్యూరు మునిసిపాలిటీలో 92 మందికి, ఉయ్యూరు మండలంలో 178 మందికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. ఈ పింఛన్లను ఉయ్యూరు, గండిగుంట గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన సభల్లో లాంఛనంగా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. పింఛన్ల పెంపుతో పాటు కొత్త పింఛన్లు మంజూరు చేసి పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పింఛన్లు తొలగించేశారంటూ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. దమ్ముంటే చంద్రబాబు, ఎల్లో మీడియా నిరూపించాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయికి వస్తే వాస్తవాలు తెలుస్తాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారమే వచ్చే ఏడాది పెంచిన పింఛను రూ.3 వేలు లబ్ధిదారులకు అందుతాయని ప్రకటించారు. అర్హతే తమ ప్రభుత్వానికి కొలమానం అన్నారు. టీడీపీ మాదిరిగా జన్మభూమి





ఉయ్యూరులో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, గొడవర్రులో పింఛన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే. పక్కన జెడ్పీటీసీ సభ్యుడు బాబు, ఎంపీపీ రాజ్యలక్ష్మి

కమిటీల పేరుతో రాజకీయాలు చేయటం లేదని స్పష్టంచేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కమిషనర్ వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసా బేగం, కౌన్సిలర్లు గుంజా సుధాకర్, రాజులపాటి చిన్ని, గోన మదన్, డాక్టర్ జంపాన పూర్ణిమ, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు మండలంలో..

కంకిపాడు: ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ తమ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన పింఛన్ల పంపిణీ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని గొడవర్రు, కంకిపాడు, పునాదిపాడు, ఉప్పలూరు గ్రామాల్లో మంగళవారం సభలు జరిగాయి. గొడవర్రు, కంకిపాడు, ఉప్పలూరు సభల్లో ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తానని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీకి అనుగుణంగానే పాలన సాగిస్తున్నారన్నారు. అర్హతే కొలమానంగా పథకాలు అందుతున్నాయన్నారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పెత్తనం అధికంగా ఉండేదని విమర్శించారు. అర్హులు అందరికీ ఇళ్ల స్థలాల పంపిణీపై దృష్టి సారిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, వైస్ ఎంపీపీ ధూళిపూడి కృష్ణకిషోర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు మేరుగు విజయ చంద్రశేఖర్, బాకీ రమణ, ముసిబోయిన విజయకుమారి, లాం సోనియా, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, పీఏసీఎస్ చైర్మన్ కాగిత శ్రీమన్నారాయణ, సీహెచ్‌సీ చైర్మన్ మేదంద్రావు కుటుంబరావు, పలువురు ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. మండలంలోని మారేడుమాక గ్రామంలో సర్పంచ్ చోడవరపు ఆదర్శకుమార్ కొత్త పింఛన్ల పంపిణీ చేశారు.

ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం



ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినిని సన్మానిస్తున్న విద్యార్థులు

పెనమలూరు: మండలంలోని తాడిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. సంఘ సంస్కర్త, మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్.కనకదుర్గ మాట్లాడుతూ తరతరాలకు స్ఫూర్తిదాయని సావిత్రిబాయిపూలే అని కొనియాడారు. ఆమె ఆశయసాధనకు నేటి విద్యార్థులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

పరస్పర సహకారంతో ఉత్సవాలు నిర్వహిద్దాం

కార్యనిర్వహణాధికారి లోకేశ్వరి

రామవరప్పాడు: రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలను ఈ సంవత్సరం కూడా వైభవంగా నిర్వహించేందుకు అందరి సహకారం అవసరమని ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి అన్నారు. సంక్రాంతి ఉత్సవాల నిర్వహణకు సలహాలు, సూచనలు నిమిత్తం మంగళవారం పేరంటాలమ్మ ఆలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సమావేశంలో రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామస్తులతో పాటు పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ, హెల్త్ అధికారులు పాల్గొన్నారు. అమ్మవారి గ్రామోత్సవ రూట్ మ్యాప్‌ను భక్తులకు చూపించారు. లోకేశ్వరి మాట్లాడుతూ కోవిడ్ నిబంధనలు అనుసరిస్తూ ఉత్సవాల సమయంలో గర్భగుడి ప్రవేశం నిషేధించినట్లు తెలిపారు. ఆరోగ్య శిబిరాలు, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు ట్రాఫిక్ పోలీసులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ట్రాఫిక్ ఏసీపీ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయం జాతీయ రహదారిని అనుకుని ఉండటంతో ఉత్సవాల సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వాహనపూజలు, మొక్కుబడుల సమయంలో భక్తులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరించాలని కోరారు. భక్తులు పలు సలహాలు, సూచనలను ఆలయ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. 5 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భక్తులు ఇబ్బందులు పడకుండా మొబైల్ టాయిలెట్లను గ్రామంలో పలు చోట్ల ఏర్పాటు చేయాలని కోరారు. భక్తుల మనోభావాలను గౌరవిస్తూ రూట్‌మ్యాప్ ప్రకారం అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించాలన్నారు. ఇప్పటి వరకు పేరంటాలమ్మ అమ్మవారి ఫొటోలు భక్తులకు అందుబాటులో లేవని ఉత్సవ సమయంలో అమ్మవారి చిత్రపటాలను అందుబాటులోకి తీసుకొస్తే ఉభయ జిల్లాల నలుమూలల నుంచి వచ్చే భక్తులు తమ తమ పూజగదుల్లో ఉంచుకోవడానికి వీలుగా ఉంటుందని తెలిపారు. రైవస్ కాలువలో నిర్వహించే తెప్పోత్సవాన్ని వీక్షించేందుకై ముందుగా నిర్వహించాలని కోరారు. ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ సమ్మెట సాంబశివరావు, సర్పంచ్ వరి శ్రీదేవి, ట్రాఫిక్ సీఐ గంగాధర్, పటమట సీఐ కాశీ విశ్వనాథ్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఇరు గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ కార్యనిర్వహణాధికారి లోకేశ్వరి

వంట గదులు ప్రారంభం

నున్న (విజయవాడ రూరల్): నున్న గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన వంట షెడ్డును హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.భూపాల్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ షెడ్డుల నిర్మాణానికి పూర్వ విద్యార్థులు భీమవరపు ముత్తారెడ్డి, నరెడ్ల సత్యనారాయణరెడ్డి, కలకోటి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ కావూరు ప్రఫుల్‌చంద్, తాడేపల్లి వేణుగోపాలరావు, గుంటక భాస్కరరెడ్డి, మందా సత్యనారాయణ, మల్లెల జమలయ్య, మట్టా సత్యనారాయణ, బుర్రముక్కు కోటిరెడ్డి ఆర్థిక సహాయంతో రెండు వంట గదులను నిర్మించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సహాయం అభినందనీయమన్నారు. వంట షెడ్డు నిర్మాణానికి, గతంలో అదనపు తరగతి గదుల నిర్మాణాలు, భోజనహాల్ నిర్మాణానికి తదితర అభివృద్ధి పనులకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులకు ఆమోదం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్ వరి శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన సాధారణ సమావేశంలో అజెండాలోని పలు అంశాలను పాలకవర్గసభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో రబ్బీసుతో మెరక వేసే పనులు ఆమోదించారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు, వీధి దీపాల మరమ్మతుల, రక్షిత మంచినీటి సరఫరా పనుల కాంట్రాక్టు సిబ్బంది టెండరు మార్చితో ముగుస్తుండటంతో 2023–24 ఆర్థిక సంవత్సరానికి కాంట్రాక్టు సిబ్బంది టెండర్లు పిలిచే నిమిత్తం పాలకవర్గ సభ్యులు ఆమోదించారు. జలజీవన్ మిషన్ పథకంలో మంజూరైన పనుల గురించి చర్చించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం జన నివాసాలకు దూరంగా ఏర్పాటు చేసే అంశంపై పలువురు వార్డు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే జిల్లా కలెక్టరు, ఎక్సైజ్ ఉన్నతాధికారులకు ఈ విషయంపై వినతి పత్రాలు సమర్పించామని గుర్తు చేశారు. ఈ విషయంపై పాలకవర్గ సభ్యులంతా చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు.

లక్ష్యాన్ని మించి ధాన్యం సేకరణ

కంకిపాడు: ఖరీఫ్ సీజన్‌లో లక్ష్యాన్ని మించి ధాన్యం సేకరించామని తహసీల్దార్ టి.వి.సతీష్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 14 రైతు భరోసా కేంద్రాల ద్వారా ఖరీఫ్ సీజన్‌కు 29 వేల టన్నులు ధాన్యం సేకరించాలన్నది లక్ష్యమన్నారు. ఇప్పటి వరకూ 3,571 మంది రైతుల నుంచి 30,361 టన్నులు సేకరించామని తెలిపారు. ధాన్యం సేకరణకు అవసరమైన గోనె సంచులను రైతుభరోసా కేంద్రాల వద్ద సమృద్ధిగా అందుబాటులో ఉంచామన్నారు. ఇప్పటికే 7.73 లక్షలు గోనె సంచులు సరఫరా చేశామని పేర్కొన్నారు. ప్రతి ధాన్యం గింజ కొనుగోలుచేసి రైతులకు మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ధాన్యం విక్రయించిన 3,141 మంది రైతులకు 20 రోజుల లోపే వారి ఖాతాలకు సొమ్ము జమైందని తెలిపారు. ఇప్పటికే మండలం వ్యాప్తంగా రూ.53.04 కోట్లు రైతులకు అందిందని పేర్కొన్నారు. రైతులు ధైర్యంగా ఉండాలని, ప్రతి ఒక్కరికీ ధాన్యం సొమ్ము నిర్ణీత గడువు లోగా అందేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

హ్యాండ్‌బాల్ పోటీల నిర్వహణకు సాయం

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ఈ నెల 13, 14 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల నిర్వాహణకు రోటరీక్లబ్ అధ్యక్షుడు చిమట రామారావు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు మంగళవారం హ్యాండ్‌బాల్ పోటీల ఆర్గనైజర్ గంపా రాంబాబుకు నగదును రామారావు అందజేశారు. ఈ పోటీలకు వచ్చే క్రీడాకారులకు భోజన వసతి, క్రీడా సదుపాయల నిమిత్తం సాయం చేసినట్లు రామారావు తెలిపారు. ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టీఎస్ఆర్‌కే.ప్రసాద్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు సీఎం జగన్ భరోసా

నున్న (విజయవాడ రూరల్): రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు పెద్దకొడుకు భరోసాను ఇస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజారంజక పాలన చేస్తున్నారని విజయవాడ రూరల్ ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి అన్నారు. మండలంలో నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో కొత్తగా మంజూరైన వైఎస్సార్ పెన్షన్ కానుక లను మంగళవారం నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపీపీ ప్రసన్నకుమారి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ని ఆశీర్వాదించి మళ్లీ గెలిపించాలన్నారు. సాంకేతిక కారణాల వలన పెండింగ్‌లో వున్న పెన్షన్లను పరిశీలించి అర్హులైన వారికి పునరుద్ధరించడం జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 39 లక్షల పెన్షన్లు ఇచ్చేవారని, ఈ ప్రభుత్వం పార్టీలకతీతంగా 64 లక్షల మందికి పెన్షన్లు అందజేస్తోందన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ బీవీ శేషగిరిరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో నున్న గ్రామ సర్పంచి కాటూరి సరళ, అంబాపురం సర్పంచి గండికోట సీతయ్య, పి.నైనవరం సర్పంచి బట్టాసోమయ్య, ఎంపీటీసీ సభ్యులు బొంతు సరోజిని, ప్రత్తిపాటి నాని, గిరిజా కుమారి, గ్రామ పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, ఉప సర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, కొత్తగా ఎన్నికైన కన్వీనర్లు, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శులు జిటివి రమణ, ఎస్, చెన్నకేశవరావు, టి.భారతి, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పెన్షన్ అందజేస్తున్న ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు

యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యం

- ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్
- ఉద్యోగ నియామక ఉత్తర్వుల పంపిణీ



నియామక ఉత్తర్వులు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీమోహన్

గన్నవరం: నియోజకవర్గంలోని నిరుద్యోగులైన యువతి, యువకులను గుర్తించి వారికి ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పేర్కొన్నారు. ఇటీవల విజయవాడకు చెందిన స్మార్ట్‌టెక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో బైజ్యూస్ సంస్థలో ఉద్యోగాలకు ఎంపికైన 12 మందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా వంశీమోహన్ మాట్లాడుతూ..గ్రామాలకు వెళ్లినప్పుడు నిరుద్యోగుల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు జాబ్ మేళా నిర్వహించినట్లు చెప్పారు. ఈ జాబ్‌మేళాలో 12 మంది యువత ఏడాదికి రూ.7.50 లక్షల ప్యాకేజీతో బైజ్యూస్‌లో ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. గ్రామీణ యువత ప్రతిభకు అనుగుణంగా వివిధ ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించి వారి ఆర్థిక పురోభివృద్ధికి చేయూత అందిస్తున్నట్లు వివరించారు. ఈ జాబ్‌మేళాలో పెద్ద సంఖ్యలో యువకులు బెంగళూరు, హైదరాబాద్, కర్నూలు నగరాల్లోని పలు కంపెనీల్లో ఉద్యోగాలు పొందారన్నారు. అనంతరం ఉద్యోగాలు పొందిన యువతి, యువకులు ఎమ్మెల్యే వంశీమోహన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. స్మార్ట్ టెక్స్ సీఈవో దివ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

విజయవాడ రూరల్: నున్న గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులు లేళ్ల పూర్ణశ్రీ,తురక దివ్య రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎన్నికయ్యారు. గత నెల 29వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వైఎస్సార్ కడప జిల్లా చిన్న మండెంలోని ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూల్లో నిర్వహించిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ అండర్–19 విభాగం పోటీల్లో గెలుపొంది, రాష్ట్రస్థాయికి ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయులు వి.భూపాల్‌రెడ్డి తెలిపారు. త్వరలో చండీఘర్‌లో జరుగనున్న జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరఫున పూర్ణశ్రీ,తురక దివ్యలు ఆడనున్నారని ఆయన వివరించారు. మంగళవారం హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్స్ ముత్యాల వెంకటేశ్వరరావు, విజయవర్మలను, ఎంపికైన విద్యార్థినులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. పీఎస్ అసిస్టెంటుగా పనిచేస్తున్న కేవీఎస్ ఈశ్వరావు క్రీడాకారిణులకు ప్రోత్సాహక నగదు బహుమతిగా వెయ్యి రూపాయల చొప్పున ఇద్దరికి అందజేశారు.

గ్రామాల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం

పెనమలూరు: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని ఈఓపీఆర్డీ కోరా శ్రీనివాసరావు తెలిపారు. చోడవరం గ్రామంలో సర్పంచి కాకర్ల వెంకటరత్నం అధ్యక్షతన మంగళవారం గ్రామసభ జరిగింది. ఈ సభలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గ్రామ సభల్లో ప్రజల నుంచి వచ్చిన సూచనలతో గ్రామాభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. గ్రామంలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. పంచాయతీకి ఆదాయ వనరులు సమకూర్చే విషయంలో పంచాయతీ, సచివాలయ సిబ్బంది పని చేయాలని సూచించారు. పెదపులిపాకలో సర్పంచి గంటూరు శ్రీనివాసచౌదరి, గంగూరులో అక్బర్‌బాషా ఆధ్వర్యంలో గ్రామసభలు జరిగాయి.

జగనన్నతో సొంతింటి కల సాకారం

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

ఉయ్యూరు: పేదల సొంతింటి కల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సాకారం అవుతోందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని గండిగుంట జగనన్న లే అవుట్–1లో 167 మంది లబ్ధిదారులకు మంగళవారం ఇళ్లస్థలాల పొజిషన్ చూపారు. 60 మంది లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి రూ.30 లక్షల రుణం అందించారు. కాలనీలో నూతన బోర్లు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ.. జగనన్న లే అవుట్లలో పేదలకు స్థలాలు మంజూరు చేసి ఇళ్లు కేటాయిస్తున్నామన్నారు. పేదలు తమకు ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని సంతోషంగా గృహప్రవేశాలు చేయాలని సూచించారు. ఉయ్యూరు, గండిగుంటలో త్వరలోనే టిడ్కో ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గెత్తం అనుపమ, ఎంపీపీ చీలి కల్పన, తహసీల్దార్ మస్తాన్, ఎంపీడీఓ విమాదేవి, ఎంపీటీసీ సభ్యుడు బందెల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు దాసే రవి, వల్లభనేని వెంకటేశ్వరరావు, గొల్లపూడి వేణు, గెత్తం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గండిగుంటలో గృహ నిర్మాణ లబ్ధిదారులకు రూ.30 లక్షల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

అర్హులందరికీ పింఛన్లు

పెనమలూరు: పెనమలూరు యానాదుల కాలనీలో కొత్త పంఛన్లను మంగళవారం పంపిణీ చేశారు. యానాదులకు గతంలో ప్రభుత్వం ఇళ్లు నిర్మాణం చేసింది. కాలనీలో ఉన్న అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా వలంటీర్ నాగమణి కొత్తగా పింఛన్లు మంజూరయిన మనికల లక్ష్మయ్యతో పాటు పలువురికి నగదు పంపిణీ చేశారు. మండలంలో ఇప్పటి వరకు 90 శాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీఓ సునితాశర్మ తెలిపారు.

రామవరప్పాడు: రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికి పింఛన్లను అందజేస్తుందని ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అన్నారు. మంగళవారం రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లిలో పెన్షన్ వారోత్సవాలు నిర్వహించి కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు, ప్రసాదంపాడు సర్పంచ్ సర్నాల గంగారత్నం బాలాజీ, రామవరప్పాడు, నిడమానూరు సర్పంచ్‌లు వరి శ్రీదేవి, శీలం రంగారావు, గన్నవరం ఏఎంసీ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి, పలు గ్రామాల కన్వీనర్లు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు తదితరులు ఈ కార్యక్రజుమంలో పాల్గొన్నారు.



ప్రసాదంపాడులో కొత్తగా మంజూరైన పింఛన్లు అందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

6న కొత్త పింఛన్ల పంపిణీ

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఈ నెల 6న కొత్త పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. మండలంలో కొత్తగా మంజూరైన 420 మంది లబ్ధిదారులకు పింఛన్లను ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చేతుల మీదుగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

11న ఆర్డీఓ కార్యాలయంలో అర్జీలు ఇవ్వాలి

తహసీల్దార్ మల్లికార్జునరావు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 11లో ఏపీఐఐసీ కేటాయించిన భూముల్లో నష్టపరిహారం అందని వారి నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు తహసీల్దార్ టి.మల్లికార్జునరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పరిహారం అందని రైతులు ఈ నెల 11వ తేదీన గుడివాడ ఆర్డీవోకు అర్జీలు అందజేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జేసీ, డీఆర్వో, ఆర్డీవోలతో కలెక్టర్ ఓ కమిటీని నియమించారని తెలిపారు. ఈ కమిటీ ఆక్రమణదారుల అర్జీలను పరిశీలించి, అర్హులైన వారికి నష్ట పరిహారం మంజూరు చేస్తారని చెప్పారు. రైతులు తమ భూములకు సంబంధించిన సరైన ఆధారాలు, డాక్యుమెంట్లతో అర్జీలు సమర్పించాలని సూచించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద జెడ్పీహైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి జగనన్న స్ఫూర్తి ఫ్రీ మెటీరియల్ పంపిణీ చేశారు. 10వ తరగతి విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు సంబంధించిన స్టడీ మెటీరియల్ దీనిలో పొందు పరిచారని, విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. శ్రద్ధగా చదివి ఉత్తీర్ణత సాధించాలన్నారు. 10వ తరగతిలో విద్యార్థులందరూ మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎం ఎంపీ సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుల తల్లి సావిత్రీబాయి పూలే

గన్నవరం రూరల్: ఆదర్శనీయురాలు సావిత్రిబాయి పూలే అని మండలంలోని చనుపల్లివారిగూడెం ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం వెంకన్నబాబు కొనియాడారు. మంగళవారం ఆమె జయంతి సందర్భంగా పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఉపాధ్యాయులతో కలసి ఆయన పూలతో నివాళులర్పించారు. దేశంలో మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, చదువుల తల్లి అని కీర్తించారు. విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఎదగాలన్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: నేటి తరం ఉపాధ్యాయులకు సావిత్రిబాయి పూలే ఆదర్శనీయురాలని యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.సుదర్శనం, ఎంఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. బాపులపాడు మండలం మల్లవల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నివాళి అర్పించారు. నాటి సాంఘిక కట్టుబాట్లను వ్యతిరేకించి బాలికా విద్యను ప్రోత్సాహించేందుకు సావిత్రిభాయి చొరవ సాహసోపేతమని కొనియాడారు. మహిళలను విద్యావంతులు చేయటం కోసం ఉద్యమించారని చెప్పారు. సినీయర్ జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు వెలమర్తి ప్రమీలకు యూటీఎఫ్ తరుపున సావిత్రిబాయి పూలే అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు బి.సుదర్శనం, మల్లేశ్వరరావు, వాసుదేవరావు పాల్గొన్నారు.



సావిత్రీబాయి పూలేకు నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం వెంకన్నబాబు

దావాజిగూడెం (గన్నవరం): మండలంలోని దావాజిగూడెం బీసీ బాలికల హాస్టల్‌లో సర్పంచి బడుగు బాలమ్మ అధ్యక్షతన భారతదేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. సావిత్రీబాయి పూలే చిత్రపటానికి జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళల విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన సావిత్రీబాయి పూలే ఉద్యమకారిణిగా కొనియాడారు. ఏఎంసీ మాజీ డైరెక్టర్ సూరెడ్డి మణిమ్మ, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.